# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 26 మే 2024 | SANGAREDDY


## పెద్దమ్మతల్లి చల్లగా చూడాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు/నారాయణరావుపేట, మే 25: ప్రజలను పెద్దమ్మతల్లి చల్లగా చూడాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మండలంలోని పెద్దకోడూరు, కిష్టాపూర్ గ్రామాల్లో శనివారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌రావుకు నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పెద్దమ్మతల్లి దయతో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, వైస్ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు భూంరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సాయన్న, మాజీ సర్పంచ్‌లు అంగమూర్తి, కవిత, మధు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది పెద్దమ్మతల్లి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు.



సిద్దిపేట జిల్లా కిష్టాపూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు అమ్మవారి ఫొటోను బహూకరిస్తున్న ముదిరాజులు



ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న నాగరాజు

## బీఆర్‌ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ గూండాగిరి

- తృటిలో తప్పించుకున్న కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు
- దాడిని ఖండించిన మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు

రామాయంపేట, మే 25: వ్యక్తిగత కక్షతో బీఆర్‌ఎస్ నాయకుడు గజవాడ నాగరాజుపై కాంగ్రెస్ నాయకుడు దాడి చేసిన ఘటన రామాయంపేట పట్టణంలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజుకు కాంగ్రెస్ నాయకుడు పోచమ్మల గణేశ్‌కు కొంతకాలంగా భూమి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పట్టణంలోని పెద్దమనుషుల సమక్షంలో ఓ ఆలయం వద్ద మాట్లాడుతుండగా మధ్యలో 5 లీటర్ల పెట్రోల్ డబ్బాతో వచ్చి నాగరాజుపై దాడికి దిగడమే గాకుండా ఒంటిపై పెట్రోల్ పోశాడు. అక్కడే ఉన్నవారు విషయం గ్రహించి వెంటనే పోచమ్మల గణేశ్‌ను పక్కకు తోసేశారు. దీంతో గజవాడ నాగరాజు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి దవాఖానలో చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు కామారెడ్డిలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ప్రశ్నించే గొంతుకను బెదిరింపులతో నిలువరించలేదు: హరీశ్‌రావు**

ప్రశ్నించే గొంతుకలైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ బెదిరింపులతో నిలువరించలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. రామాయంపేట పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజుపై కాంగ్రెస్ నాయకుడు పోచమ్మల గణేశ్ దాడిచేసిన విషయం తెలుసుకున్న హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకుల ఆగడాలు ఇలాగే ఉంటే ప్రతిదాడులు ఉంటాయన్నారు.

**కాంగ్రెస్ అండ చూసుకునే దాడులు**

కాంగ్రెస్ అండ చూసుకుని బీఆర్‌ఎస్ నాయకులపై దాడులకు దిగడం మానుకోవాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదగిరి హెచ్చరించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న నాగరాజును పరామర్శించారు.

**దాడులు సరికావు: పద్మాదేవేందర్‌రెడ్డి**

పెట్రోల్ దాడికి గురైన కౌన్సిలర్ గజవాడ నాగరాజును మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ దాడులను ఇకపై సహించేది లేదన్నారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి గానీ వ్యక్తిగత కక్షలతో, పార్టీ పేరుతో దాడులు చేయడం సరికాదన్నారు.

## అదును దాటుతోంది..

### జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలు ఎక్కడ..?

- రైతులకు అందుబాటులో లేని విత్తనాలు
- నిత్యం విత్తనాల కోసం రోడ్డెక్కుతున్న అన్నదాత
- రైతులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

సిద్దిపేట.మే 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వానకాలం సీజన్‌కు ముందే జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై రైతులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో విత్తనాల కోసం రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. మండల కేంద్రాల్లో ఉన్న ఆగ్రోస్ వద్ద రైతులు బారులుదీరి కనిపిస్తున్నారు. క్యూలో చెప్పులు, ఇతర సంచులు పెడుతున్నారు. అరకొర విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తున్నా రైతులకు అందడం లేదు. రోహిణి కార్తె చివరి పాదం లేదా వచ్చే కార్తెలో వరినార్లు పోస్తారు. నార్లు ఎదిగే లోపల జీలుగ, జనుము, పచ్చరొట్ట విత్తనాలను విత్తుతారు. ఈ విత్తనాలను ప్రధానంగా ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో విక్రయాలు చేస్తున్నారు. జీలుగ 30 కిలోల బస్తాకు రూ.2,790 కాగా రూ.1,674 సబ్సిడీపోనూ రూ1,116 రైతు చెల్లించాలి. జనుము 40 కిలోల బస్తాకు రూ.3,620 కాగా రూ.2,172 సబ్సిడీపోనూ రూ.1,448 చెల్లిస్తాడు. పిల్లి పెసర 20 కిలోల బస్తాకు రూ.2,710 కాగా రూ.1,626 సబ్సిడీపోనూ రైతు రూ. 1,084 చెల్లిస్తున్నాడు.

**విత్తనాలు అందించడంలో సర్కార్ విఫలం**

ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి సరిపడా పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలు అందించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కేసీఆర్ సర్కార్ సకాలంలో విత్తనాలను రైతులకు అందుబాటులో పెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో డిమాండ్‌కు తగ్గట్లు విత్తనాలు అందుబాటులో ఉంచాలన్న కనీస ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. వ్యవసాయ శాఖపై సాగు ప్రణాళిక, విత్తనాలు, ఎరువులు తదితర అంశాలపై జిల్లాకు చెందిన మంత్రులు రివ్యూలు కూడా చేయలేదు. వానకాలంలో వరిని ఉమ్మడి జిల్లాలో 7,77,113 ఎకరాల్లో సాగు చేస్తారనే అంచనా ఉంది. ఇందుకు తగ్గట్లుగా జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో పెట్టి రైతులకు అందించాలి.



సంగారెడ్డి జిల్లా జోగిపేటలో టోకెన్ల కోసం క్యూలో పట్టాపాసు పుస్తకాలు పెట్టిన రైతులు



ఇటీవల విత్తనాలు దొరక్క జోగిపేట రైతుసేవా కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

**నేల సారవంతమవుతుంది...**

పంట వేసే ముందు రైతులు పొలాల్లో జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలు నాటుతారు. ఏపుగా పెరిగిన వాటిని కలియదున్నితే నేల సారవంతమవుతుంది. పంటకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గి జీవ ఎరువులుగా ఉపయోగపడే ఈ విత్తనాలపై కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించడంతో రైతుల్లో చైతన్యం వచ్చింది. అప్పటి ప్రభుత్వం ముందుచూపుగా సకాలంలో అన్ని ఆగ్రో సెంటర్ల ద్వారా రైతులకు సబ్సిడీపై అందించింది. దీంతో రైతులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించారు. ఐదారేండ్లుగా రైతులు పొలాల్లో వానకాలం సాగుకు ముందు పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలు విత్తుతున్నారు. దానిని పొలంలో కలియ దున్నడం వల్ల అవి కుళ్లి నేలకు అత్యధిక పరిమాణాల్లో పోషకాలు అందుతాయి. పొలంలో కలియ దున్నడం వల్ల నత్రజని పెరగడంతో పాటు నేలకు సత్తువ వస్తుంది. మొక్కలు వృద్ధి చెంది నేల అట్టడుగు పొరల నుంచి పోషకాలను సంగ్రహించగలుతాయి. యూరియా వినియోగం తగ్గుతుంది. చెరువు మట్టి, పశువుల పేడ, కోళ్ల ఎరువు తదితర వాటి కన్న పదిరెట్లు ఎక్కువగా పచ్చిరొట్ట భూములను సారం చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందుబాటులో విత్తనాలను పెట్టలేదు. కాలం నెత్తిమీదికి వచ్చింది. ఎప్పుడు ఈ ప్రభుత్వం విత్తనాలు అందిస్తుంది. ఎప్పుడు సాగు చేస్తాం అంటూ రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### 15 రోజుల నుంచి ఎదురుచూస్తున్నాం..



జీలుగ విత్తనాల కోసం పదిహేను రోజుల నుంచి ఎదురుచూస్తున్నాం. అక్కన్నపేటలోని ఆగ్రో రైతు సేవాకేంద్రం చుట్టూ రోజూ తిరుగుతున్నాం. రేపు, మాపంటూ తిప్పుతున్నారు. ఎప్పుడు వస్తాయో, రావో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఆలస్యంగా జీలుగ చల్లితే తీరా వానకాలం నాట్లు వేసే సరికి పెరగకపోతే ఎలాంటి ప్రయోజనం ఉండదు. అసలు గీ సర్కారులో రైతులను పట్టించుకునేటోళ్లు కరువయ్యారు. – మంకిడి రవీందర్, రైతు, అక్కన్నపేట

### పదేండ్లలో ఎప్పుడూ రోడ్డెక్కలేదు..



వానకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సీజన్ ఆరంభంలోనే విత్తనాల కోసం ఎండలో నిలబడే ఓపిక లేక పాసు పుస్తకాలు లైన్లో పెట్టి పడిగాపులు కాయాల్సి వచ్చింది. అయినా సరిపోను విత్తనాలు దొరకలేదు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎరువులు, విత్తనాలు తెచ్చుకున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఇలాంటి పరిస్థితి వచ్చింది. – శ్రీధర్‌రెడ్డి, రైతు, నేరడిగుంట, అందోల్ మండలం


